సాక్షి తిరుపతి

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



కుంకీ సక్సెస్

కుంకీ ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. మదపు టేనుగు ఎట్టకేలకు చిక్కింది.

- 8లో



గడపగడపలో విశేష స్పందన

వెంకటగిరిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	26
చిత్తూరు	34	24
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	35	25

న్యూస్‌రీల్

యోగా డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా యూనివర్సిటీలో 2023–2024 సంవత్సరానికి సంబంధించి డిప్లొమో ఇన్ యోగా, పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రజిని తెలిపారు. డిప్లొమా కోర్సుకు ఇంటర్ అర్హతగాను, పీజీ డిప్లొమా కోర్సుకు డిగ్రీ అర్హత ఉండాలని సూచించారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తుతోపాటు రిజిస్ట్రార్, పద్మావతి మహిళావర్సిటీ, తిరుపతి పేరుమీద తీసిన రూ.150 డీడీని, సెప్టెంబర్ 30లోపు అందజేయాలని కోరారు. దరఖాస్తులను వర్సిటీ వెబ్‌సైట్ నుంచి లేదా వర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో నేరుగా పొందవచ్చని తెలిపారు.

తీరంలో ఈదురు గాలులు



దెబ్బతిన్న వేట సామగ్రి

వాకాడు: మండలంలో గురువారం ఈదురు గాలులతోపాటు, ఓ మాదిరి వర్షం కురవడంతో అంజలాపురం సముద్ర తీరంలోని మత్స్యకారుల వేట సామగ్రి దెబ్బతింది. వాతావరణంలో అనూహ్య మార్పుల కారణంగా సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. అలాగే బీభత్సమైన గాలులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో మత్సకారులు వేట సామగ్రిని తీరంలోని చెట్లకు కట్టి భద్రపరిచారు. అందులో బోట్లు, వలలు దెబ్బతిన్నాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు మత్స్యకారులు తెలిపారు.

చర్యలు తప్పవు



ఆక్రమణకు గురైన భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి సిటీ : వెంకటగిరి నియోజకవర్గం, బాలాయపల్లి మండల పరిధిలోని మేత పోరంబోకు భూములు ఆక్రమణకు గురైనట్లు గురువారం 'సాక్షి'లో 'పచ్చ నేతల మేత' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మండల రెవెన్యూ అధికారులు అప్రమత్తమై ఆక్రమణకు గురైన భూములను పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

'నేను పుట్టి 68 ఏళ్లు పూర్తయ్యింది. నా స్థాపనకు కృషిచేసిన పెద్దలకు ధన్యవాదాలు. నా అభివృద్ధికి పాటుపడిన నేతలకు కృతజ్ఞతాభివందనాలు. అందరి కృషితో దిగ్విజయంగా 69వ వసంతంలోకి అడుగుపెడుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. నా బిడ్డలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుంటే చూసి గర్వపడుతున్నాను. శాస్త్ర, సాంకేతిక, రాజకీయ రంగాల్లో దూసుకుపోతుంటే చూసి ఆనందిస్తున్నాను. ఇన్నేళ్లు నన్ను ఆదరించి, అభిమానించిన అందరికీ పేరుపేరునా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను..' అని చెబుతున్నట్టుంది కదూ.. ఈ చిత్రంలోని యూనివర్సిటీ. 68 వసంతాలు పూర్తిచేసుకుని శనివారం నాటికి 69వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..



ముస్తాబైన ఎస్వీయూ

విరబూసిన విద్యాపూదోట!

సాక్షి ఫోకస్

- రేపు ఎస్వీయూ వ్యవస్థాపక దినోత్సవం
- 52 విభాగాలు, 78 కోర్సుల్లో విద్యాబోధన
- పటిష్టంగా జాతీయ విద్యావిధానం అమలు
- పరిశోధనల్లో పదును పెంచేందుకు రీసెర్చ్ సైంటిఫిక్ ల్యాబ్
- త్వరలో రూ.10కోట్లతో ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ
- అక్టోబర్‌లో కాన్వొకేషన్‌లకు సన్నాహాలు

తిరుపతి సిటీ: రాయలసీమకే తలమానికంగా ఎస్వీ యూనివర్సిటీ విరాజిల్లుతోంది. విద్యా, ఉపాధి కల్పనే లక్ష్యంగా దూసుకుపోతోంది. 68 ఏళ్లగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. మద్రాసు యూనివర్సిటీ అనుబంధ సంస్థగా ఉన్న ఎస్వీయూ 1954లో టంగుటూరి ప్రకాశం పంతులు కృషితో స్థాపించబడింది. తొలి ఏడాదిలో ఆరు మేజర్ విభాగాలతో ప్రా రంభమైన ఈ వర్సిటీ నేడు 52 విభాగాలు, 78 కోర్సులలో 7 వేల మందికి ఉన్నత విద్యనందిస్తోంది. ఇప్పటికే నాక్ ఏ గ్రేడ్ పొందిన ఈ వర్సిటీ త్వరలో ఏ ప్లస్ గ్రేడ్‌ను సాధించేందుకు ప్రయత్నిస్తోంది.

వర్సిటీపై వైఎస్సార్ మార్క్



ఎస్వీయూలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి మార్క్ ఇప్పటికీ స్పష్టంగా కనబడుతోంది. ప్రధానంగా గత ప్రభుత్వం విస్మరించిన 300 మంది ఎన్ఎమ్ఆర్‌లకు టైంస్కేల్ ఇచ్చిన్న ఘనత వైఎస్సార్‌దే. ఇప్పటికీ ఉద్యోగులు ఆయన్ను స్మరించుకుంటున్నారు. గతంలో వర్సిటీ వజ్రోత్సవం సందర్భంగా యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన గోల్డన్ జూబ్లీ ఆర్చ్ ఆయన తీపిగురుతులను గుర్తుచేస్తూనే ఉంది. కొత్తగా నిర్మించిన ఇంజినీరింగ్ బాయ్స్ హాస్టల్స్ అప్పటివే. వర్సిటీకి ఆర్థిక లోటు రాకుండా బ్లాక్ గ్రాంట్ నిధులు పెంచడం, 2007లో 107 శాశ్వత అధ్యాపక పోస్టులకు నియామకాలు చేపట్టి వర్సిటీ ఉద్యోగుల గుండెలలో తనకంటూ శాశ్వత స్థానం సంపాదించుకున్నారు.

తండ్రి బాటలోనే ..

తండ్రి వైఎస్సార్ బాటలోనే తనయుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎస్వీయూపై వరాలు కురిపించారు. గత ఏడాది ఏప్రిల్‌లో వర్సిటీ ఆవరణలో జరిగిన మేగా జాబ్‌మేళా ద్వారా సుమారు 20వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, విద్యారుణాలు కల్పించారు. దీంతో పాటు నూతన విద్యావిధానం, ఆరోగ్యకేంద్రంలో అధునాతన పరికరాల ఏర్పాటుకు సహకరించారు. తాత్కాలి ఉద్యోగుల వేతనం పెంపు, 110 జీవో అమలు, అధ్యాపకులకు 65 ఏళ్లకు వయోపరిమితి పెంపు, బోధన, బోధనేతర సిబ్బందికి పదోన్నతలు, పెండింగ్‌లో ఉన్న అరియర్స్ చెల్లింపు, ఎర్నడ్ లీవు, హెల్త్ స్కీమ్ ఏర్పాటు చేశారు.

రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు

గత ఏడాదిగా రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో కొత్తగా అకడమిక్, మెన్స్ హాస్టల్ భవనాలు, ఫార్మసీ కళాశాల, సైన్స్ కాలేజ్, ఉమెన్స్ వసతి గృహాల మరమ్మతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ల్యాబొరేటరీల మరమ్మతులు చేపట్టారు. విద్యాబోధన కోసం డిస్‌ప్లేల బోర్డులు, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. త్వరలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో వర్సిటీ బ్యూటిఫికేషన్, అండర్ డ్రైనేజ్ సిస్టమ్, నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించనున్నారు.

విస్తృతంగా పరిశోధనలు

పరిశోధనలలో పదును పెంచేందుకు వర్సిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఐఐటీ, ఐజర్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల సమన్వయంతో క్లస్టర్లను ఏర్పాటు చేసి మ్యూచివల్ కో–ఆపరేషన్‌తో పరిశోధనలను కొనసాగించాలని నిర్ణయించారు. వర్సిటీలో పరిశోధనలను మెరుగుపరిచేందుకు రూసా భవనంలో అడ్వాన్స్ రీసెర్చ్ సైంటిఫిక్ ల్యాబొరేటరీని ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు ఇంజినీరింగ్ విద్యార్థుల వృత్తి నైపుణ్యం కోసం మరో ఐదు నూతన ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు.

ప్లేస్‌మెంట్ సెల్, జాబ్ మేళాల నిర్వహణ

వర్సిటీలో విద్యార్థులకు ఉపాధి కల్పించే దిశగా ప్రత్యేకంగా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, ప్లేస్‌మెంట్ సెల్, జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏడాదిలో 30 వేల మంది ఉద్యోగాలు సాధించారు. వచ్చే నెల మొదటి వారంలో మరోమారు ప్రభుత్వ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారు.

కొత్త కోర్సులకు శ్రీకారం

ఎస్వీయూలో జాతీయ విద్యావిధానాన్ని అమలు చేసేందుకు వర్సిటీ ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న కోర్సులకు అధనంగా బీకాం ఆనర్స్, సైకాలజీ వంటి ప్రత్యేక కోర్సులను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దూరవిద్యా విభాగం ద్వారా ఆన్‌లైన్ డిస్టెన్స్ లర్నింగ్ (ఓడీఎల్) కోర్సులను అందించనున్నారు. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న రెండు కాన్వకేషన్‌లను అక్టోబర్, నవంబర్ మాసాలలో నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.10కోట్ల వ్యయంతో త్వరలో యూనివర్సిటీలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీని ఏర్పాటు చేయనుంది.

సంతోషంగా ఉంది



యూనివర్సిటీలలో ఎస్వీయూ అంటే ప్రత్యేక బ్రాండ్, ఇమేజ్ ఉంది. ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దింది. ముఖ్యమంత్రులను, సివిల్ సర్వెంట్లను, గ్రూప్స్ అధికారులను అందించింది. ఇలాంటి విద్యా సంస్థకు వీసీ సేవలందించడం సంతోషంగా ఉంది.

–కే.రాజారెడ్డి, వైస్‌చాన్సలర్, ఎస్వీయూ

గర్వంగా ఉంది



వచ్చే అక్టోబర్, నవంబర్‌లో రెండు కాన్వకేషన్‌లు జరిపేందుకు ప్రయత్నిస్తున్నాం. విద్యార్థులకు వర్సిటీలో అత్యాధునిక సదుపాయాలతో విద్యాబోధన జరుగుతోంది. ప్రపంచ దేశాలలో ఎస్వీయూ ముద్దుబిడ్డలు ఉన్నత స్థానాలలో ఉన్నారు. అలాంటి వర్సిటీకి రిజిస్ట్రార్‌గా సేవచేసే భాగ్యం కలిగినందుకు గర్వంగా ఉంది.

–మహ్మద్‌హుస్సేన్, రిజిస్ట్రార్, ఎస్వీయూ

వ్యవస్థాపక దినోత్సవానికి ఏర్పాట్లు

ఎస్వీ వర్సిటీ 69వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 2న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభించారు. వర్సిటీని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

నవగ్రహ పూజలో మంత్రి పెద్దిరెడ్డి దంపతులు



శ్రీ వకుళమాత ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన నవగ్రహాల పూజల్లో రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలత దంపతులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. –తిరుపతి రూరల్

వేడుకగా మహా చండీహోమం

తిరుపతి కల్చరల్: రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గురువారం మహా చండీ హోమాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ మండపం వద్ద అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి అర్చకులు శాస్త్రోక్తంగా మహా చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మందికిపైగా దంపతులు పాల్గొని హోమ పూజలు నిర్వహించారు. ఉదయం 8.30 నుంచి ఆరంభమైన మహా చండీహోమం 11.45 గంటలకు నిర్వహించిన పూర్ణాహుతితో ముగిసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మహా చండీహోమంలో పూర్ణాహుతి చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు పీ.ధనశేఖర్, ఎస్.భారతి పాల్గొన్నారు.



మహా చండీహోమంలో టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆలయ చైర్మన్, ఈఓలు

కళాబృందాలకు చక్కటి వసతులు



అతిథి గృహాలను పరిశీలిస్తున్న జేఈఓ సదాభార్గవి

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వాహన సేవల్లో ప్రదర్శనలిచ్చేందుకు వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసే కళాబృందాలకు చక్కటి వసతులు కల్పించాలని టీటీడీ జేఈఓ సదాభార్గవి సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జేఈఓ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ఉదయం, రాత్రి వాహన సేవల్లో పాల్గొనే కళాకారులకు వారికి తగ్గట్టుగా ధర్మగిరి వేద పాఠశాలలో బస ఏర్పాట్లు చేయాలన్నారు. కళాకారుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. టీటీడీ ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, రిసెప్షన్ డెప్యూటీ ఈఓ భాస్కర్, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ఎస్టేట్ విభాగం ప్రత్యేకాధికారి మల్లికార్జున పాల్గొన్నారు.

పున్నమి వెన్నెల్లో కల్యాణ వెంకన్న



గరుడ వాహనంపై ఊరేగుతూ..

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి గురువారం రాత్రి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. శ్రావణ మాసం పౌర్ణమి సందర్భంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ శోభాయమానంగా చేపట్టారు. రాత్రి సర్వాలంకార భూషితుడైన స్వామివారు గరుడ వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

క్లుప్తంగా

ముక్కంటి సేవలో మంత్రి వేణుగోపాలకృష్ణ


ముక్కంటి దర్శనానికి వెళుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 71,132 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,963 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.06 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మూడు రోజుల పాటు ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసిన ఒంటరి మదపుటేనుగు చిక్కడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మదపుటేనుగును పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు చేపట్టిన 'ఆపరేషన్ కుంకీ' విజయవంతమైంది. దాదాపు 20 గంటల పాటు కొనసాగిన ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో దాదాపు 70 మంది ఆంధ్ర, తమిళనాడుకు చెందిన అటవీశాఖ యంత్రాంగం పాల్గొంది. బంధించిన ఒంటరి ఏనుగును తిరుపతి జూ పార్కుకు తరలించడంతో విషాదంతో మొదలైన ఈ ఘటన.. సుఖాంతమైంది.


మదపుటేనుగును బంధించి తీసుకెళ్తున్న జయంతి, వినాయక

కుంకీ సక్సెస్

- మదపుటేనుగును బంధించిన అటవీశాఖ
- అడుగడుగునా అడ్డంకులు అధిగమించి.. ఆపై బంధించి
- సహకారం అందించిన తమిళనాడు అటవీ యంత్రాంగం
- భీకరి' చిక్కడంతో ఊపిరి పీల్చుకున్న సరిహద్దు ప్రజలు
- తిరుపతి జూ పార్క్‌కు గజరాజు తరలింపు

చిత్తూరు రూరల్/గుడిపాల: రెండు రోజుల పాటు గజగజలాడించిన ఒంటరి ఏనుగును అటవీశాఖ అధికారులు గురువారం చాకచక్యంగా పట్టుకున్నారు. బుధవారం ఉదయం గుడిపాల మండలంలో బీభత్సం సృష్టించి దంపతులను చంపి.. మరో వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన విషయం విధితమే. దీంతో రంగంలోకి దిగిన అటవీశాఖ అధికారులు బుధవారం రాత్రి కుంకీ ఆపరేషన్‌ను మొదలుపెట్టారు. కుంకీల(రామకుప్పం మండలం ననియాల ట్రైనింగ్ సెంటర్ నుంచి వచ్చిన ఏనుగులు జయంతి, వినాయక)తో పాటు 12 మంది ట్రాకర్స్, 40 మంది అటవీశాఖ అధికారులు, మరో 10 మంది తమిళనాడు అటవీశాఖ అధికారులు, 10 మంది శ్రీవేంకటేశ్వర జూపార్కు సిబ్బంది ఏనుగును వెంబడించారు. బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆపరేషన్ ప్రారంభమైంది.

ఆపరేషన్ సాగిందిలా..

190 రామాపురం ప్రాంతంలో ప్రారంభమైన ఆపరేషన్ అరుల్‌పురం, పేయనపల్లి, శెట్టిస్‌తంగాల్, చీలాపల్లి మీదుగా బుధవారం అర్ధరాత్రి 2 గంటల వరకు సాగింది. అటవీ ప్రదేశమంతా చీకటిగా ఉండడంతో ఏనుగు జాడ కనిపించలేదు. అర్ధరాత్రి 2.30 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు చిత్తూరు మండలం పోతురాజులపల్లె, తాళంబేడు ప్రాంతాల్లో జల్లెడ పట్టారు. తెల్లవారు జామున 5.10 గంటలకు తమిళనాడు రాష్ట్రం పెరియబోడి నత్తం గ్రామంలోకి వెళ్లిన ఒంటరి ఏనుగు మహిళను తొండంతో కొట్టి, ఆపై తొక్కి చంపేసినట్టు చిత్తూరు అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. అక్కడి నుంచి ఏనుగు గుడిపాల మండలంలోని 197 రామాపురం వైపు మళ్లింది. ఆ ప్రాంతంలో ఓ ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసింది. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు తాళంబేడు నుంచి 197 రామాపురానికి పరుగులు పెట్టారు. అక్కడికి 9 గంటలకు చేరుకున్న అధికారులు ఏనుగు జాడను కనిపెట్టారు. దాన్ని పట్టేందుకు అటవీశాఖ అధికారుల ప్రయత్నానికి వర్షం అడ్డంకిగా మారింది. ఆపై చెరుకుతోటలో తలదాచుకున్న ఒంటరి ఏనుగును డ్రోన్, కుంకీల సాయంతో గుర్తించారు. ఆపై తిరుపతి జూపార్కు డాక్టర్ అరుణ్ మత్తు ఇంజక్షన్ వేశారు. ఆ తర్వాత నెమ్మదిగా అడుగులు వేస్తూ..కొంత దూరంలో ఏనుగు కిందపడిపోయింది. మత్తులో నుంచి తేరుకోవడానికి డాక్టర్లు మరో ఇంజక్షన్ ఇచ్చారు. ఆపై కుంకీల సాయంతో బండి ఎక్కించేందుకు లాక్కెళ్లారు. ఎంతకీ బండి ఎక్కక పోవడంతో అధికారులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

రాత్రంతా జాగరణ

గజ సంచారంతో గుడిపాల, చిత్తూరు మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు బుధవారం రాత్రంతా జాగరణ చేశారు. ముందస్తుగా ఏనుగు సంచారం ఉన్న గ్రామాల్లో అధికారులు దండోరా వేయించారు. ప్రజలను అప్రమత్తం చేయించారు. యువకులు, పెద్దలు టపాసులు పేల్చుతూ ఊర్లకు కాపలా కాశారు. కాగా ఏనుగు బంధీ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.


197 రామాపురం వద్ద ఏనుగు జాడను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు


197రామాపురంలో ధ్వంసమైన ద్విచక్ర వాహనం


మృతిచెందిన తమిళనాడుకు చెందిన మహిళ

అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు


దంపతుల మృతదేహాలకు అంత్యక్రియలు

ఒంటరి ఏనుగు సృష్టించిన విధ్వంసంలో ప్రాణాలు కోల్పోయిన 190–రామాపురానికి చెందిన దంపతులు వెంకటేశ్వర్లు(54), సెల్వి (47) మృతదేహాలకు అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గ్రామానికి వచ్చి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం సాయంత్రం గ్రామస్తులు, చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల అశ్రునయనాల నడుమ అంత్యక్రియలను నిర్వహించారు.

బాధిత కుటుంబానికి సాయం

చిత్తూరు కలెక్టరేట్ : ఒంటరి ఏనుగును పట్టుకునేందుకు నిర్వహించిన ఆపరేషన్ గజ విజయవంతం అయినట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గుడిపాల మండలంలో ఒంటరి ఏనుగు దాడిలో దంపతులు మరణించడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున రూ.10 లక్షలు సాయం చేసి ఆదుకున్నట్లు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


బత్తెయ్య మృతదేహం

ఏర్పేడు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ముసలిపేడులో గురువారం చోటుచేసుకుంది. ఏర్పేడు సీఐ శ్రీహరి అందించిన వివరాలు.. మండలంలోని ముసలిపేడు ఎస్టీ కాలనీకి చెందిన పాన్నూరు బత్తెయ్య(43) మంగళవారం ఒంటరిగా సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో బత్తెయ్య కుటుంబ సభ్యులు అటవీప్రాంతంలో వెదికారు. గురువారం అటవీ ప్రాంతంలో గుబురు పొదల్లో బత్తెయ్య మృతిచెంది ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీహరి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉండడం, శరీరంపై కాలిన గుర్తులు ఉన్నట్లు గుర్తించారు. పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదిలావుండగా అడవి జంతుల కోసం గుర్తుతెలియని వేటగాళ్లు వేసిన ఉచ్చులో పడి బత్తెయ్య మృతిచెంది ఉంటాడని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

వెంకటగిరి రూరల్‌లో..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నరసింహారావు

వెంకటగిరి రూరల్: అనుమానా స్పదంగా వ్యక్తి మృతిచెందిన ఘటన పట్టణంలోని తోలిమిట్టలో వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం.. తోలిమిట్ట ప్రాంతానికి చెందిన బండారు గురవయ్య (45) బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం గురవయ్య మరో వ్యక్తితో కలిసి మద్యం సేవించి ఇంట్లో పండుకుని అపస్మారక స్థితికి చేరారు. గమనించిన భార్య లక్ష్మి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే గురవయ్య మృతిచెందినట్టు నిర్ధారించారు. గురవయ్య హఠాత్తుగా మరణించడంపై తమకు పలు అనుమానాలు ఉన్నాయని బంధువులు ఆరోపించారు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

అడవి దొంగలపై వేట


స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్‌తో అటవీ సిబ్బంది

సైదాపురం: కొంత కాలంగా అటవీ ప్రాంతంలో విలువైన ఖనిజ సంపదను కొల్లగొడుతున్న అడవి దొంగలనపై అటవీశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ఈ ఘటన గురువారం మండలంలోని తోకలపూడి అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. నెల్లూరు రేంజర్ మాల్యాద్రి కథనం.. జిల్లా అటవీ అధికారి ఆవుల చంద్రశేఖర్ ఆదేశాల మేరకు.. సైదాపురం మండలంలోని తోకలపూడి అటవీ సమీపంలో ఖనిజ సంపదను రాత్రి పూట తవ్వకాలు జరుపుతున్నట్టు సమాచారం వచ్చింది. నెల్లూరు అటవీశాఖ రేంజ్ అధికారులు సదరు ప్రాంతంలో బుధవారం రాత్రి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఖనిజ సంపద కోసం తవ్వుతున్న జేసీబీని సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అక్కడే ఖనిజాన్ని లోడ్ చేస్తున్న ట్రాక్టర్‌తో పాటు మోటార్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో నెల్లూరు, మర్లపూడి సెక్షన్ అధికారి అమీనయ్య, గిరిజాకుమారి, రవిశేఖర్, ఖాసీం, రాజేంద్ర, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

జింకను అప్పగించిన స్థానికులు


మినీ వ్యాన్‌లో జింకను తరలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

దొరవారిసత్రం: కుప్పారెడ్డిపాళెం ఎస్సీ కాలనీలోకి చుక్కల జింక రావడంతో కాలనీ వాసులు కుక్కల భారిన పడకుండా దాన్ని కాపాడి ఫారెస్ట్ అధికారులకు అప్పగించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు కథనం.. కుప్పారెడ్డిపాళెం ఎస్టీ కాలనీలో జన సంచారంలోకి చుక్కలు జింక వచ్చి ఎటూ వెళ్లకుండా అక్కడే ఉండిపోయింది. గుర్తించిన స్థానికులు దాన్ని పట్టుకుని వెంటనే నేలపట్టు పక్షుల కేంద్రం వన్యప్రాణి విభాగం అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్ఓ భాస్కర్ రెడ్డి ఆదేశాలు మేరకు కాలనీ వాసులు పట్టుకున్న జింకను ఎఫ్ఎస్ఓ బాలయ్య, బీటు ఆఫీసర్లు శ్రీనివాసులు, బాలకృష్ణా స్వాధీనం చేసుకుని పక్షుల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో సురక్షింతంగా వదిలిపెట్టారు.

గడప గడపలో విశేష స్పందన


నమస్కారం తాత!


సంక్షేమ పథకాలపై ఆరాతీస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గురువారం ఆయన మండలంలోని కోమటిగుంట రాజుపాళెంలో గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించగా.. అక్కడి ప్రజలు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ప్రభుత్వ తీరు ఎలా ఉందంటూ.. గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధుడు కొండూరు ఈశ్వరరాజును ప్రశ్నించగా.. శభాష్..! అంటూ సమాధానం ఇచ్చారు. ఆపై నందిమండలం కృష్ణమ్మ కుటుంబాన్ని పలకరించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంక్షేమ బుక్‌లెట్ అందజేశారు.

లక్ష్మీనరసింహుడికి తులసీ దళార్చన


లక్ష్మీనరసింహుడు, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీదేవి


స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి గురువారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. లోకకల్యాణార్థం స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తులసీ దళాలతో తులసీదళార్చన పూజలు చేసినట్లు ఏసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి, ఆంజనేయ స్వామికి ఉదయం సుప్రభాతం, అభిషేకం, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణ మండపంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీ ఉత్సవమూర్తులను కొలువు దీర్చి, వివిధ పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం తులసీదళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిలక్ష్మీదేవికి కుంకుమార్చన సేవ నిర్వహించారు. ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు వినోద్‌స్వామి, శశిస్వామి, నాగరాజస్వామి పాల్గొన్నారు.